గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి

• ఎమ్మెల్యే మేకపాటి

నెల్లూరు(దర్గామిట్ట): గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులను, కార్యకర్తలను ఒక్క తాటిపైకి తెచ్చి రానున్న 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించుకునేలా సమష్టిగా కృషి చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం నెల్లూరు మేకపాటి క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు మండలం కనుపూరుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకుని ఉన్నామని, కార్యాచరణ ద్వారా అభివృద్ధి చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో కనుపూరుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు రాచగొర్ల శంకరయ్య తదితరులు ఉన్నారు.



నాయకులతో కలిసి భోజనం చేస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ఏపీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ జె.పుష్పరాజ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో పీజీటీ జీవశాస్త్రం ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు జనవరి 3వ తేదీలోగా తమ దరఖాస్తులను దాఖలు చేయాలన్నారు. ఈ పోస్టుకు పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ, టెట్ ఉత్తీర్ణులు అర్హులన్నారు.

ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ ఏపీ ఉపాధ్యక్షుడిగా రమణయ్య

సోమశిల: అనంతసాగరం మడలం పాతాళపల్లి గ్రామానికి చెందిన కానగల రమణయ్యను ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జాతీయ అధ్యక్షుడు వరిందర్ కుమార్‌ఫూల్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బోయ మద్దులేటి, ఆంధ్రప్రదేశ రాష్ట్ర అధ్యక్షులు పిడుగు చంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. రమణయ్య మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమగ్రంగా నిర్వర్తిస్తానన్నారు.

నూతన సంవత్సరంలో అన్ని శుభాలు కలగాలి

• ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: 2024 ఆంగ్ల నూతన సంవత్సరం నియోజకవర్గ ప్రజలకు సకల శుభాలు చేకూర్చాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం అన్నారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఈ ఏడాది ప్రారంభంలోనే పెంచిన పింఛన్ రూ.3 వేలు త్వరలో అందించనున్నట్లు తెలిపారు. ప్రజల ఆదరాభిమానాలతో రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు కానుందని ఇందుకు ప్రజలందరి సంపూర్ణ సహకారాలు అవసరమన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

• వంద లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఆత్మకూరు: అక్రమంగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 20 లీటర్ల సారాయి స్వాధీనం చేసుకుని, వంద లీటర్ల బెల్లం ఊటను సెబ్ సీఐ నయనతార ఆధ్వర్యంలో ధ్వంసం చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆమె విలేకరులకు వివరించారు. ఏఎస్‌పేట వినాయక నగర్ అడ్డు రోడ్డు వద్ద ఓ వ్యక్తి 20 లీటర్ల సారాయిని కలిగి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా ఆమె తన సిబ్బందితో దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద సేకరించిన సమాచారం మేరకు సమీపంలోని పొలాల్లో సారాయి తయారు చేసేందుకు సిద్ధంగా ఉన్న బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆమె తెలిపారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు వివరించారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ సీఐ నయనతార, సిబ్బంది

మేకపాటిని కలిసిన గండిపాళెం వైఎస్సార్‌సీపీ నాయకులు



మేకపాటిని కలిసి సమస్యలు విన్నవిస్తున్న రమణయ్య, తదితరులు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంకు చెందిన మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ గొల్లపల్లి కల్పన, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలోని చేపల కేంద్రం వద్ద ఖాళీగా ఉన్న స్థలాన్ని జగనన్న లేఅవుట్‌కు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాల భవనాలకు నూతన భవనాలు మంజూరు చేయించాలని, సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పంచాయతీకి రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయని అనుమతి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గఫూర్, రమేష్, సుమన్, కూర్మయ్య, పాముల రాజా, కుమారరాజా తదితరులున్నారు.

బైక్‌ను కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

సంగం: మండలంలోని దువ్వూరు వద్ద నెల్లూరు- ముంబయి జాతీయ రహదారిపై కారు, బైక్ ఢీకొన్న ఘటనలో బైక్ నడుపుతున్న వెంగారెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఎస్.రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెంకు తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

సచివాలయ ఉద్యోగుల సంఘం జాయింట్ సెక్రటరీగా బిలాల్

అనుమసముద్రంపేట: ఆంధ్రప్రదేశ్ విలేజ్ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీగా అనుమసముద్రం సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ షేక్ మొహమ్మద్ బిలాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. బిలాల్ విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన ఈ బాధ్యతలకు వన్నె తెచ్చేటట్లు సచివాలయ ఉద్యోగుల సంక్షేమం సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు.



బిలాల్

మహిళ మెడలో సరుడు అపహరణ

వరికుంటపాడు: వ్యవసాయ పొలంలో గడ్డి కోస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళ మెడలోని సరుడును అపహరించుకుని వెళ్లిన ఘటన ఆదివారం వరికుంటపాడులో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఆంధ్రావారిపల్లెకు చెందిన మద్దిరెడ్డి సీతారావమ్మ బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలంలో గడ్డి కోస్తుండగా ఈ ఘటన జరిగింది. బాధిత మహిళ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై కె.సుమన్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దుండగుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని ఎస్సై తెలిపారు.

పరిహారం పెంచాలని రైతుల ఆందోళన

ఉదయగిరి: దుత్తలూరు–సీతారామపురం మార్గంలో కొత్తగా నిర్మిస్తున్న 165బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని మండలంలోని యర్రబల్లిగడ్డ వద్ద పలువురు రైతులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఎకరాకు బహిరంగ మార్కెట్ ధర రూ.20 లక్షలు ఉండగా, అధికారులు కేవలం రూ.1.45 లక్షలు మాత్రమే పరిహారం ఇస్తామని చెబుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించి వాస్తవ మార్కెట్ ధరల ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.
ఈ కార్యక్రమంలో శకునాలపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డితో పాటు పలువురు రైతులున్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

సోమశిల: అనంతసాగరం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు ఆదివారం ఏపీటీఎఫ్ క్యాలెండర్, ప్యాకెట్ డైరీలు, పౌచ్‌లు, సీఎల్ క్యాట్ బుక్ పంపిణీ చేశారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాషా, గౌరవ అధ్యక్షుడు రామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్ మాల్యాద్రి రెడ్డి ప్రతి పాఠశాల ఉపాధ్యాయులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



















పింఛన్ పండగ

- ఈ నెల 3 నుంచి రూ.3 వేలు పెంపు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఆత్మకూరు: కొత్త సంవత్సరం ఆరంభంలోనే వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది. ఈ నెల నుంచి సామాజిక పింఛన్ రూ.3 వేలు వంతున పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వం గత నెల వరకు ఇస్తున్న పింఛన్ మొత్తంపై మరో రూ.250 పెంచి ఈ నెల నుంచి అందించనుంది. గత టీడీపీ ప్రభుత్వంలో తాము పింఛన్ అందుకునేందుకు ప్రతి నెలా తాము పడిన పాట్లను గుర్తు తెచ్చుకుని మళ్లీ అలాంటి చీకటి రోజులు రాకూడదని వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంటున్నట్లు పలువురు లబ్ధిదారులు చెబుతున్నారంటే వారి ఆనందం ఎలా ఉందో అర్థమవుతోంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు విడతలుగా పెంచి జనవరి నెల నుంచి రూ.3 వేలు ఇవ్వనున్నారు. 3వ తేదీ నుంచి ఇవ్వనున్న విషయం తెలిసిందే. దీంతో పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టీడీపీ పాలనలో గ్రామాల్లో ఎవరైనా వ్యక్తి మృతి చెందితే వారి స్థానంలో పింఛన్లు నమోదు చేసుకొనే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం వలంటీర్లు ఇంటికే వచ్చి వారి పరిస్థితిని చూసి అర్హత ఉంటే పింఛన్లు నమోదు చేస్తుండడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. 2019 మే నెలకు ముందుతో పోలిస్తే ఒక్కొక్క మండలంలో అదనంగా వందల మంది అర్హత కలిగిన వారికి పింఛన్లు మంజూరయ్యాయి. దీనికి తోడు గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఆమోదిస్తేనే పింఛన్ రాసేవారని వృద్ధులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా డయాలసిస్ పేషెంట్లకు ఏకంగా రూ.10 వేలు పింఛన్ అందుతుండడంతో వారికి ఆర్థిక భారం తగ్గింది. ప్రతి నెలా ఒకటో తేదీ ఠంఛన్‌గా తెల్లవారు జామునే ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తున్న విధానం ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు. మళ్లీ ఓట్లలో జగనన్నకే ఓటు వేసి తమ ప్రభుత్వాన్ని గెలిపించుకుంటామని వారు ఘంటాపథంగా చెప్పడం గమనార్హం.

మండలం పేరు	పింఛన్‌దారులు గతం / ప్రస్తుతం 2019 / 2023	నగదు మొత్తం గతం / ప్రస్తుతం 2019 / 2023
మున్సిపాలిటీ	2906 / 3422	రూ.90,50,000 / రూ.94,93,500
ఆత్మకూరురూరల్	4205 / 4993	రూ.88,73,000 / రూ.1,38,46,250
మర్రిపాడు	5152 / 6333	రూ.1,08,78,000 / రూ.1,75,01,000
అనుమసముద్రంపేట	- / 4087	- / రూ.1,18,36,280
అనంతసాగరం	5609 / 6276	రూ.1,20,94,000 / రూ.1,75,37,000
సంగం	5985 / 6820	రూ.1,34,66,250 / రూ.1,88,40,750
చేజర్ల	4626 / 5237	రూ.1,42,78,500 / రూ.1,45,38,500



ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు

ఇప్పుడు ఆనందంగా ఉంది



నాలుగేళ్ల నుంచి నేరుగా ఇంటికే వచ్చి వలంటీరు పింఛన్ ఇస్తోంది. ఎలాంటి ఇబ్బంది లేదు. అప్పట్లో పొద్దునే పోయి సాయంత్రం వరకు పంచాయతీ ఆఫీస్ దగ్గర క్యూలో నిలుచుంటే ఎప్పటికో పింఛన్ ఇచ్చే వారు. ఇప్పుడు ఆ కష్టాలు లేకుండా ఇంటికే తెచ్చి ఇస్తుండడంతో ఆనందంగా ఉంది. ఇప్పుడు ఇవ్వబోయే పింఛన్ పెంచి రూ.3 వేలు అందుకోనుండడం మరింత సంతోషంగా ఉంది. – ఇమ్మరాజు కొండయ్య, పి దేవరాయపల్లి, అనంతసాగరం మండలం

ఆ కష్టాలు ఇంక రాకూడదు



నడవలేని నేను వేరొకరిపై ఆధారపడి ప్రతి నెలా పింఛన్ తీసుకొనేందుకు పంచాయతీ ఆఫీస్ దగ్గరకి వెళ్లేవాడిని. రోజంతా అక్కడే సరిపోయేది. నా వల్ల మరో వ్యక్తి కాచుకొని ఉండాలి. జగనన్న ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లుగా ఇంటి దగ్గరికే పింఛన్ అందిస్తుండడం మాకు వరంలాంటిదే. ఆ ప్రభుత్వంలో పడిన కష్టాలు ఇంక రాకూడదు. జగనన్నకే ఎప్పటికీ మద్దతు ఇస్తా. – బత్తల వాసు, వావిలేరు, చేజర్ల మండలం

గడపగడపకు నిధులతో సీసీరోడ్లు

సోమశిల: అనంతసాగరం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మితమవుతున్నాయి. గడపగడపకు కార్యక్రమంలో ప్రజలు అభ్యర్థన మేరకు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. తొలి విడతలో సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు కాగా తాజాగా మరో రూ.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమై గ్రామాలు సుందరంగా మారనున్నాయి.

రామాలయం నిర్మాణానికి భూమి పూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: మండలంలోని ఇస్కదామెర్ల పంచాయతీ కేవీఆర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కోదండరామస్వామి ఆలయానికి ఉదయగిరి సమన్వయ కర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజల చేసిన అనంతరం భూమి పూజను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చిమ్మలి రవీంద్ర, గుడవల్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయండి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయమే ధ్యేయంగా మండల కమిటీ నాయకులు పని చేయాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని మండలాల్లో పార్టీ కమిటీలను ఆదివారం నియమించారు. ఆత్మకూరు అర్బన్ కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నలిశెట్టి శ్రీనివాసులు, షేక్ ముతీవర్, రూరల్ కన్వీనర్‌గా చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సానా వేణుగోపాల్ రెడ్డి, బి గిరిబాబు, అనంతసాగరం మండల కన్వీనర్‌గా రాపూరు వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా జి వెంకట రమణ, ఎస్ పెంచలయ్య, ఏఎస్‌పేట మండల కన్వీనర్‌గా పందిళ్ల సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ సందానీ బాషా, అంబవరపు కోటిరెడ్డిలను చేజర్ల మండల కన్వీనర్‌గా తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా టి వెంకట రత్నారెడ్డి, అల్లం స్వప్న, మర్రిపాడు మండల కన్వీనర్‌గా బొర్రా వెంకట సుబ్బిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కోనంకి శ్రీనివాసులు నాయుడు, మందా రామచంద్రారెడ్డి, సంగం మండల పార్టీ కన్వీనర్‌గా పులగం శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా షేక్ షబ్బీర్, ఎ మల్లికార్జునను ఎంపిక చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. పార్టీకి విధేయతగా పనిచేస్తూ గెలుపు లక్ష్యంగా సేవలు అందించాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కోరారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం

బిట్రగుంట: బోగోలు మండలం వైఎస్సార్‌సీపీ కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడిగా మద్దిబోయిన వీరరఘు యాదవ్, ఉపాధ్యక్షులుగా పాపన మల్లారెడ్డి, ఏకే సుందరరాజ్, జనరల్ సెక్రటరీలుగా ఉప్పాల మాచర్ల, కావాటి క్రాంతికుమార్, కాటంగారి గిరిబాబు, ట్రెజరర్‌గా పులిగిల్లి మోహన్ శర్మ, సెక్రటరీలుగా ముక్కర రవీంద్రబాబు, షేక్ ఖరీం బాషా, రాయి శ్రీనివాసులు యాదవ్, నాటకరాణి వెంకట రమణయ్య, ఉప్పాల వెంకటకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జంపాని యలమందయ్య, చౌటూరి వనజ, ఒట్టూరు మాల్యాద్రి, జూపూడి అనిత, గాదం నవీన్, దోని శివకృష్ణ, ప్రళయకావేరి పోలమ్మ, ధన్యాసి రాఘవేంద్ర, జెడ్డా మంగమ్మ, తలారి నారాయణ, కోట మమత, యాకసిరి వెంకటశేషయ్య, మేకల బాబు, చిలకా జయరాములు, బత్తల వెంకటేష్‌ను నియమిస్తూ కేంద్ర కార్యాలయం ఉత్తర్వు జారీ చేసింది.

ఆత్మకూరు మండలం..

ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సానా వేణుగోపాల్ రెడ్డి, బొడ్డు గిరినాయుడు, ప్రధాన కార్యదర్శులుగా గడ్డం శ్రీనివాసులురెడ్డి, ఆర్.శంకరయ్య, పఠాన్ మహమ్మద్ రఫీ, కోశాధికారిగా దిశించర్ల ప్రసాద్ నియమితులయ్యారు. కార్యదర్శులుగా కండ్లగుంట శైలజ, పఠాన్ ఖాసీం, ఏడెం పెంచలరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, తోడేటి అశోక్, కార్యవర్గ సభ్యులుగా మంజాన్ బాషా, షేక్ రసూల్, సిద్ధం నారాయణమ్మ, గంధం రమణమ్మ, పాశం లింగయ్య నాయుడు, దొడ్ల వెంకటేశ్వర్లు, సన్నిబోయిన రమణమ్మ, యేసుపోగు కుమారి, షేక్ అయేషా, చల్లా పోలమ్మ, మంగళ జయమ్మ, పోటు పెంచలమ్మ, తుమ్మల అరుణ, బోనం తిరుపతమ్మ నియమితులయ్యారు.

ఎమ్మెల్యే మేకపాటి నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి నెల్లూరులోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ తిరుపతినాయుడు, ఆనంద్‌రెడ్డి, రవీంద్రనాయుడు, వరప్రసాద్, సుధీర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

భూగర్భ డ్రైనేజీకి శంకుస్థాపన

వింజమూరు (ఉదయగిరి): వింజమూరులోని దేవతమహల్ నుంచి బైపాస్‌కు వెళ్లే మార్గంలో ఉన్న మురుగునీటి కాలువ స్థానంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులు చేపడుతున్నారు. ఈ డ్రైనేజీ పూర్తయితే వింజమూరు నుంచి బైపాస్, బీజీకేఆర్ ఎస్టీ కాలనీ వైపు వెళ్లే మార్గం సుగమం అవుతుంది. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు బి.సుమలత, ఎంపీటీసీలు హేమావతి, డేగా వంశీ, పురుషోత్తం, మౌనిక, ప్రసన్న, సర్పంచ్ ఎస్.సుజన, ఉపసర్పంచ్ ఎం.జయలక్ష్మి, స్థానిక నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, మద్దూరు చిన్నికృష్ణారెడ్డి, గణపం పెదమాలకొండారెడ్డి, జూపల్లి రాజారావు, కాటంరమణారెడ్డి, కొండా వెంకటేశ్వరరావు, మద్దూరు రాజగోపాలరెడ్డి, గున్నం ప్రసాద్‌రెడ్డి, తదితరులున్నారు.



భూగర్భ డ్రైనేజీకి శంకుస్థాపన నిర్వహిస్తున్న దృశ్యం

ఉద్యోగుల సేవలు గుర్తుంటాయి


ఆత్మకూరు: ఉద్యోగస్తులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పదవీ విరమణ తప్పదని, అయితే వారు ఉద్యోగ విధుల్లో చేసిన సేవలు శాశ్వతంగా గుర్తుంటాయని పలువురు వక్తలు అన్నారు. ఆత్మకూరు విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయంలో క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న యు బాలకొండయ్య ఆదివారం ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన్ను ఆ శాఖ అధికారులు, తోటి ఉద్యోగులు ఆదివారం రాత్రి బాలకొండయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. విద్యుత్ శాఖలో మూడు దశాబ్దాలకుపైగా ఉత్తమ సేవలు అందించి అటు శాఖకు, ప్రజలకు బాలకొండయ్య వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈ జనార్దన్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



బాలకొండయ్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం











అయోధ్య అక్షతల శోభాయాత్ర



వింజమూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్మకూరులో అయోధ్య రామ అక్షతల ఊరేగింపులో భక్తులు

వింజమూరు (ఉదయగిరి): అయోధ్యలోని రామమందిరం నుంచి వచ్చిన శ్రీరాముడి అక్షతలతో ఆదివారం వింజమూరులో శోభాయాత్ర నిర్వహించారు. ఈ అక్షతలను ముందుగా చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి యర్రబల్లిపాళెం, కొత్తూరు శివాలయం మీదుగా బంగ్లా సెంటర్ వరకు సాగింది. రామభక్త మండలి సభ్యులు కందల మధు, గంగిశెట్టి హజరత్తయ్య, బ్రహ్మయ్య, ఎల్లాల రఘురామిరెడ్డి, పొన్నూరు ప్రకాష్, జి.పరమేశ్వరరావు, బాలకృష్ణ, కళ్యాణ్‌తో పాటు సమరసత సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్షతలకు అఖండ స్వాగతం

ఆత్మకూరు: అయోధ్య శ్రీరాముడి అక్షతలకు ఆదివారం పట్టణంలో అఖండ స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రం మేళతాళాలతో మహిళలు, పలువురు భక్తులు ఊరేగింపుగా సత్రం సెంటర్‌లోని కోదండ రామాలయానికి చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం ఇంటింటికి రాముడి అక్షతలను, అయోధ్య రామమందిర చిత్రపటం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దోర్నాదుల సురేష్‌బాబు, కుడుముల సుధాకర్‌రెడ్డి, జి సురేష్‌బాబు, చల్లా కృష్ణారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ ఆధ్వర్యంలో ఎస్ఎంకే సన్స్ చారిటబుల్ ట్రస్ట్ క్యాలెండర్‌ను ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, విశ్రాంత డీఎంహెచ్ఓ మాసిలామణి స్థానిక నాయకులు నలతాటి యాదగిరి, రావుల లక్ష్మీనారాయణరెడ్డి, చుండి వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు

తెల్లపాడులోని సీయోను ప్రార్థనా మందిరంలో సమన్వయకర్త మేకపాటి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. 2024లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాలని, సమన్వయకర్త మేకపాటి ఎమ్మెల్యేగా గెలుపొందాలని చర్చి ఫాదర్ ప్రభుకుమార్ ఆశీస్సులు అందించారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సమన్వకర్త మేకపాటి

ఐవైఎం పోస్టర్ల ఆవిష్కరణ



ఉదయగిరి: పట్టణంలోని ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ (ఐవైఎం) ఆధ్వర్యంలో 'మరలి రాదు ఈ జీవితం' అనే నినాదంతో రూపొందించిన వాల్ పోస్టర్లను ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ, ఉదయగిరి సీఐ వి.గిరిబాబు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ యువతలో నైతికత జాగరణ, అవగాహన కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. మునాఫ్ మాట్లాడుతూ దేశానికి యువత ఎంతో కీలకమని, అలాంటి యువత డ్రగ్స్, మత్తు పానీయాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవడం బాధాకరమన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు ఇందాదుల్లా, ఎస్ఐఓ జిల్లా అధ్యక్షుడు అజహరుల్లా, సభ్యులు ఇమ్రాన్, తాహిల్, తారీక్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నేడు ఫక్రుద్దీన్ బాబా గంధమహోత్సవం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ప్రముఖ పురాతన దర్గా హజరత్ సయ్యద్ ఫక్రుద్దీన్ షా వలి (ఫక్రుద్దీన్ బాబా) 257వ గంధమహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా సజ్జాదా సయ్యద్ ఆరీఫ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉరుసు, దీపాలంకరణ, బుధవారం తహలీల్ ఫాతేహాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గంధ మహోత్సవానికి వచ్చే భక్తులకు దర్గా వద్ద షామియానాలు, తాగునీరు, అన్నదానం తదితర ఏర్పాట్లు చేయనున్నామని, ఇప్పటికే దర్గాను రంగులు, లైటింగ్‌తో ముస్తాబు చేసినట్లు ఆయన తెలిపారు.